తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

27-06-2026

శనివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 139

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి

People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575



## అసైన్‌మెంట్ భూములు లాక్కుంటున్నారు

రేవంత్ అరాచకాలను మరిచిపోవద్దు

పేదలకు బీఆర్ఎస్ అండగా నిలబడుతుంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**పరిగి, జూన్ 26 :**
అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూములను లాక్కుంటున్నారని, పారిశ్రామికవాడల ఏర్పాటు పేరుతోని దళిత, గిరిజన పేదల భూములను గుంజుకుంటున్నారని కాంగ్రెస్ పాలకులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. పరిగి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పరిగిలోను పారిశ్రామికవాడల పేరుతోని స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రభుత్వం అక్రమంగా భూములు గుంజుకుంటున్నదన్నారు. లగచర్లలో రేవంత్ రెడ్డి అరాచకాలను ఎప్పటికీ

మిగతా 3వ పేజీలో..



# పాలనా సంస్కరణలకు సీఎం శ్రీకారం

- తెలంగాణ సీఎంవోలో కీలక మార్పులు
- సీఎస్‌గా సంజయ్ జాజు నియామకం
- ప్రస్తుత సీఎస్‌కు కొత్త బాధ్యతలు
- 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

**ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్:**
తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు రాష్ట్ర పాలనా యంత్రాంగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ భారీ ప్రక్షాళన, ప్రమోషన్ల బదిలీలు చేపట్టింది. పాలనను మరింత వేగవంతం చేయడానికి, పారదర్శకతను పెంచడానికి వీలుగా మొత్తం 13 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భారీ మార్పుల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయడంతో పాటు, సచివాలయంలో పారదర్శకమైన డిజిటల్, ఈకేబినెట్ విధానాన్ని బలోపేతం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

**సీఎస్‌గా సంజయ్ జాజు..**
తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్ర కేడర్‌కు తిరిగొచ్చిన ఆయన జూన్ 30న బాధ్యతలు స్వీకరిస్తారు. ఈయన సీఎస్ బాధ్యతలతో పాటు సీఎంవో పరిధిలోని ఇండస్ట్రీస్, ఐటీ, ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్, స్పీడ్ విభాగాలకు సీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

**సీఎంవోలో కీలక నియామకాలు...**
మైన్స్ అండ్ జియాలజీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను

మిగతా 2వ పేజీలో..

## సిరికథనం.. మా బాధల అక్షరమాలిక!

- తెలంగాణ ఉద్యోగ వర్గాల్లో అంతా అదే చర్చ
- ఉపాధ్యాయ, ఎన్జీవో సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టిన 'సిరి' కథనం
- వేలాది మంది ఉద్యోగుల వాట్సాప్ స్టేటస్‌గా మారిన సిరి న్యూస్ క్లిపింగ్
- 'ఒకే నోటిఫికేషన్ - రెండు పెన్షన్లు..' శీర్షికకు విశేష స్పందన
- ఏపీలో ఓపీఎస్.. తెలంగాణలో సీపీఎస్ అమలు వల్ల 11 వేల మంది ఉద్యోగుల ఆవేదన
- తమ గోడును ప్రభుత్వానికి వినిపించిన 'సిరి న్యూస్'కు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
'ఒకే నోటిఫికేషన్ రెండు పెన్షన్లు.. రేవంత్ సర్కారు తీరుపై ఉద్యోగుల ఆగ్రహం' శీర్షికన 'సిరి' దినపత్రిక ప్రచురించిన కథనం తెలంగాణ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన అభ్యర్థుల పెన్షన్ విధానంపై ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఈ వార్త కళ్లకు




మిగతా 2వ పేజీలో..



## డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టండి

- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశం

## డ్రగ్స్ రహిత రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- యువత డ్రగ్స్ కు దూరంగా వుండాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 26:**
ఈగల్ ఫోర్స్, సామాజిక న్యాయం సాధికారత శాఖలు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా అంతర్జాతీయ

మిగతా 3వ పేజీలో..






## పెట్టుబడులే కాదు.. ప్రజల జీవనమూ ముఖ్యమే

పవర్ కట్స్ లేవు.. నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం

పారిశ్రామికరంగ ప్రతినిధుల కోసం వారంలో ఒక రోజు కేటాయిస్తా

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



## కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ అధికారి

30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం

2




2

## రాష్ట్రానికి భారీ వర్ష సూచన

అరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

## ఆగస్టు నాటికి కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పనులు పరిశీలించిన మంత్రి

**వేంసూరు/ఖమ్మం, ప్రజాతంత్ర, జూన్ 26 :**
పామాయిల్ సాగు రాష్ట్ర రైతాంగానికి వరంగా మారిందని, దేశానికే ఆయిల్ ఫామ్ హబ్ గా రాష్ట్రం మారనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండలం కల్లూరుగూడెం వద్ద నిర్మిస్తున్న పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు

మిగతా 2వ పేజీలో..



## హైదరాబాద్‌లో తొలి డేటా సెంటర్ సిటీ


దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది


1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం

త్వరలో వికారాబాద్ జిల్లా చేవెళ్లలో ఏర్పాటు

సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

3






## మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

- 107 కోట్లతో చేపట్టిన 'హైడ్రా'

3



## తెలంగాణలో అధికారమే బీజేపీ లక్ష్యం

- 28నుంచి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాష్ట్ర పర్యటన
- తుంగభద్ర జలాలపై ప్రజలకు సీఎం సమాధానం చెప్పాలి
- రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2

## ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలపై కన్నేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించాల్సిందే

కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి

**హైదరాబాద్, జూన్ 26 :**
విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు వసూలు చేసే కాలేజీలు కనీస విద్యా ప్రమాణాలను, వసతులను ఖచ్చితంగా

మిగతా 3వ పేజీలో..



## మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు



- ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి
- సంచలన తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోర్టు

**మద్రాస్, జూన్ 26:**
మత మార్పిడులు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇతర వెనుకబడిన వర్గాల

మిగతా 3వ పేజీలో..

# పెట్టుబడులే కాదు.. ప్రజల జీవనమూ ముఖ్యమే

- పవర్ కట్స్ లేవు.. నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం
- పారిశ్రామికరంగ ప్రతినిధుల కోసం వారంలో ఒక రోజు కేటాయిస్తా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 26 :**

ప్రజా ప్రభుత్వానికి పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని.. అది ప్రజల జీవనోపాధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో 2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఎఫ్‌టీసీసీఐ ఒక బలమైన వారధిగా పనిచేస్తోందన్నారు. పారిశ్రామిక ప్రదర్శన యంత్రాలు, ఉత్పత్తుల ప్రదర్శన మాత్రమే కాదని, ఆలోచనలు పంచుకునే ఒక అద్భుత వేదిక అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇక్కడ చిన్న వ్యాపారులకు కొత్త కస్టమర్లు, తయారీదారులకు సరికొత్త సాంకేతికత, స్టార్టప్‌లకు తొలి కొనుగోలుదారులు లభించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పెట్టుబడిదారుల నమ్మకాన్ని చూరగొని పటిష్టంగా వృద్ధి చెందిందని తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. మన వృద్ధి కేవలం సేవల రంగానికే పరిమితం కాకూడదని చెప్పారు. జీడీపీలో పారిశ్రామిక రంగం, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈల వాటా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి కల్పనలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం కీలకమని గుర్తు చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలకు, మహిళా, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అందాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం ఎంఎస్‌ఎంఈ సంఘాలు, పారిశ్రామికరంగ ప్రతినిధులతో చర్చల కోసం సమయం కేటాయిస్తానని భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ ఎక్స్‌పోలో ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. దేశంలో కంప్యూటర్ విప్లవానికి నాంది పలికిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల అన్ని కేటగిరీలపై 100% రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చిందని, కేవలం ఈవీలను వాడటమే కాక వాటి సప్లై చైన్ టెక్నాలజీని ఇక్కడే అభివృద్ధి చేయడమే మన లక్ష్యమని చెప్పారు. 2035 నాటికి తెలంగాణలో 34 గిగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచమంతా మాట్లాడుకుంటున్న 'పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల' విధానాన్ని తెలంగాణ 1970ల నాడే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రయోగాత్మకంగా ప్రారంభించిందని, సాంకేతికతలో తెలంగాణ ఎప్పుడూ ముందే ఉంటుందని గర్వంగా చెప్పారు. గత రెండున్నరేళ్లలో పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్ల నుంచి 18,500 మెగావాట్లకు పెరిగినప్పటికీ రాష్ట్రంలో పవర్ కట్స్ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం ప్రభుత్వ పెట్టుబడులతోపాటు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌ను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పెట్టుబడులు పెట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులతో తెలంగాణ ముఖచిత్రం మారబోతోందని డిప్యూటీ సీఎం చెప్పారు. పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, విద్యార్థులు ఈ ఎక్స్‌పోను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# సిరికథనం.. మా బాధల అక్షరమాలిక!

**మొదటిపేజీ తరువాయి**




కట్టింది. ఆంధ్రప్రదేశ్ సర్కారు పాత పెన్షన్ అమలులో సానుకూల నిర్ణయం తీసుకుంటే.. తెలంగాణ సర్కారు మాత్రం కక్షపూరిత విధానాన్ని అవలంబిస్తోందన్న వాస్తవాన్ని అక్షరబద్ధం చేసిన తీరు ఉద్యోగ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. పక్క రాష్ట్రంలో ఓపీఎస్, ఇక్కడ సీపీఎస్ విధానం వల్ల నష్టపోతున్న 11 వేల మంది ఉద్యోగుల ఆవేదనను 'సిరి' దినపత్రిక ప్రతిబింబించిన తీరుకు వేలాది మంది పాఠకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.

**మా గోడు వెల్లడించిన 'సిరి'కి కృతజ్ఞతలు!**

2003 నోటిఫికేషన్ ద్వారా ఎంపికైనప్పటికీ, అప్పటి ప్రభుత్వ జాప్యం వల్లే తమకు 2004 సెప్టెంబర్ తర్వాత నియామక పత్రాలు అందాయని, ఈ సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి తమకు అన్యాయంగా సీపీఎస్ విధానం అమలు చేయడం దారుణమని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. తమ సమస్యను లోతుగా విశ్లేషించి, తమ అంతరంగాన్ని ప్రభుత్వానికి ఏకరువు పెట్టిన 'సిరి'కి వేలాది మంది ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**వాట్సాప్‌లలో చక్కర్లు..**

సిరి దినపత్రిక ప్రచురించిన ఈ కథనం ఉపాధ్యాయ, ఎన్జీవో సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ వార్తా కథనాన్ని తమ వాట్సాప్ స్టేటస్‌లుగా పెట్టుకుని తమ ఆవేదనను, ప్రభుత్వ తీరుపై తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల సాధనలో ఈ కథనం తమకు మరింత నైతిక బలాన్ని ఇచ్చిందని పలువురు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

# రాష్ట్రానికి భారీ వర్ష సూచన

**హైదరాబాద్, జూన్ 26:**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 27 నుంచి జులై 2వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వర్షంతోపాటు ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40, 50 కిలోటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# పాలనా సంస్కరణలకు సీఎం శ్రీకారం

**మొదటిపేజీ తరువాయి**



ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా నియమించారు. సీఎంవోలో పాలనాపరమైన నిర్ణయాలను వేగవంతం చేసే బాధ్యతను ఈయనకు అప్పగించారు. గత కొంతకాలంగా ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శిగా సేవలందించిన అజిత్ రెడ్డిని సీఎంవో నుంచి బదిలీ చేశారు. ఆయనను పరిశ్రమల శాఖ పరిధిలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇన్వెస్ట్ తెలంగాణ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా నియమించారు. 1999 బ్యాచ్ ఐఏఎస్ అధికారి వి.శేషాద్రి సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీగా తన విధుల్లో యథావిధిగా కొనసాగుతున్నారు. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీఎస్ కె.రామకృష్ణారావును ముఖ్యమంత్రి సలహాదారుగా, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. ఈ ప్రక్షాళనలో భాగంగా రాష్ట్రంలోని పలు కీలక శాఖల బాధ్యతలను కూడా పునర్వ్యవస్థీకరించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. దీనితో పాటు బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కూడా చూస్తారు. పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్ బదిలీ అయ్యారు. దేవాదాయ శాఖ అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. సాధారణ పరిపాలన శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు. ఎం.రఘునందన్ రావు కమర్షియల్ టాక్సెస్, ఎక్సైజ్ కార్యదర్శిగా ఉంటూనే, మైన్స్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలను స్వీకరించారు.

**పాలనా సంస్కరణలు..**

తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ పాలనా సంస్కరణలతో పాటు రాష్ట్ర సమగ్ర ఆర్థిక, సామాజిక వృద్ధిని లక్ష్యంగా చేసుకుని పలు నూతన పాలసీలు, చట్టాలు, సంక్షేమ నిర్ణయాలను ఆమోదించింది. సీఎంవోలో మార్పులు కూడా ఈ నూతన విధానాలను మరింత వేగంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లడానికే చేపట్టారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న, కొత్తగా ఆమోదించిన ప్రధాన పాలసీ నిర్ణయాలలో నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ (2026 30) ప్రధాన లక్ష్యంగా పనిచేయనుంది. 2030 నాటికి తెలంగాణను ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టడం. రాబోయే ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం, 5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించడం దీని లక్ష్యం. ఇన్నోవేషన్ ఫండ్ పాలసీ కింద రూ.100 కోట్ల ప్రాథమిక నిధితో (తర్వాత రూ.1,000 కోట్లకు పెంచేలా) 'లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ ఫండ్'ను పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, తాత్కాలిక ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ. కోటి నుండి రూ.1.5 కోట్ల వరకు ఉచిత ప్రమాద బీమా కల్పించేందుకు ప్రభుత్వం 14 ప్రముఖ బ్యాంకులతో ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే రేషన్ కార్డు ఉన్న రాష్ట్రంలోని 1.15 కోట్ల పేద కుటుంబాలకు ఉచితంగా రూ.5 లక్షల జీవిత బీమా అందించే ఈ విప్లవాత్మక పథకాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు తమ వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, వారి జీతం నుండి 15 శాతం మొత్తాన్ని కట్ చేసి తల్లిదండ్రులకు ఇచ్చేలా కొత్త చట్టాన్ని కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన ఆధారంగా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును, అలాగే ఎస్సీ వర్గీకరణను అమలు చేసే ముసాయిదా చట్టాన్ని కేబినెట్ ఆమోదించింది. డిజిటల్ మాధ్యమాల్లో సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, ప్రసంగాలను అరికట్టేందుకు కఠినమైన తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్ 2026ను తీసుకువచ్చారు. స్విగ్గీ, జొమాటో, ఓలా వంటి ప్లాట్‌ఫారమ్‌లలో పనిచేసే గిగ్ కార్మికుల హక్కులు, సామాజిక భద్రత కోసం ప్రత్యేక చట్ట సవరణలు చేశారు. ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలు, రవాణా సౌకర్యాలు, డిజిటల్ వసతులతో ప్రీప్రైమరీ నుండి 12వ తరగతి వరకు ఒకేచోట చదువుకునేలా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ పాలసీలను వేగంగా అమలు చేస్తోంది.

# కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

**హైదరాబాద్, జూన్ 26:**

రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుత సీఎస్ కె.రామకృష్ణారావు పదవీ కాలం జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు సీఎస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ, మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాక గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు. సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ, కేంద్ర సమాచారప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్, వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాక కేంద్ర నిధుల సాధనలోను, కేంద్రరాష్ట్రాల మధ్య పెండింగ్ జల వివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ, పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో రాష్ట్ర బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# ఆగస్టు నాటికి కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ

**మొదటిపేజీ తరువాయి**



స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పామాయిల్ సాగు విస్తరణలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగులో ఉండగా నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే 70 లక్షల ఎకరాల్లో విస్తరణ జరగాలన్నారు. దేశవ్యాప్తంగా 36 శాతం సాగు విస్తరణతో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వంట నూనెల దిగుమతుల కోసం మన దేశం ఏటా రూ.లక్ష కోట్లు ఖర్చు చేసే పరిస్థితులు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం పామాయిల్ ఇంపోర్ట్ టాక్స్ 44 శాతం పెంచాలని,అపుడే దేశీయంగా రైతాంగానికి మద్దతు ధరలు పెరుగుతాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రహ్లాదజోషిలను ఇటీవల కలిసి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ ఫ్రూట్ బంచ్ టన్ను గెలలు ధర రూ.23,852లు ఉందని, కనీస గ్యారంటీ ధర రూ.25 వేలుగా కేంద్రం ప్రకటించాలని కోరినట్లు గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఉండగా సిద్ధిపేట జిల్లా నర్మెట్ట లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ రైతులకు అందుబాటులో ఉండగా ఖమ్మం జిల్లాలో కల్లూరు గూడెం(కొణిజర్ల), గద్వాల జిల్లా బీచ్ పల్లి, ములుగు జిల్లా ఇంచర్ల, పెద్దపల్లి, వనపర్తి జిల్లాల్లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టు లో రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చెయ్యాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం రైతు భరోసా, రైతు భీమా పథకం, ఉచిత విద్యుత్ సరఫరాతో పామాయిల్ రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ చేస్తే తెలంగాణలో గ్రీన్ కవర్ పెరగటంతోపాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ముఖ్య భూమిక వహించనున్నదని అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు పామాయిల్ సాగు చేపట్టాలని రైతాంగాన్ని కోరారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో అధికారమే బీజేపీ లక్ష్యం

**హైదరాబాద్ జూన్ 26 :**

క్షేత్రస్థాయి నుంచి బీజేపీని మరింత బలోపేతం చేసి రాబోయే రోజుల్లో పార్టీ అధికారం దిశగా నడిపించడమే లక్ష్యంగా జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈనెల 28నుంచి మూడు రోజులపాటు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించనున్నారని వెల్లడించారు. నితిన్ పర్యటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని, పార్టీ అధికారంలోకి వస్తుందనే నమ్మకాన్ని రెట్టింపు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 28న నితిన్ శంషాబాద్ చేరుకుని అక్కడి రంగారెడ్డి జిల్లా కార్యాలయం నుండి పది జిల్లాల పార్టీ నూతన కార్యాలయాలను వర్చువల్ గా ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జీహెచ్‌ఎంసీ పరిధిలోని బూత్ అధ్యక్షుల భారీ సమావేశంలో పాల్గొంటారని, అనంతరం రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమవుతారని వివరించారు. రెండో రోజు ఉదయం వీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థులతో నిర్వహించే ప్రత్యేక కాన్‌క్లేవ్‌లో పాల్గొంటారు. అనంతరం వరంగల్‌లో లంబాడ, కోయ, చెంచు, గోండు వంటి వివిధ ఆదివాసీ, గిరిజన తెగల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన తర్వాత, ఉమ్మడి వరంగల్ జిల్లా బూత్ ప్రెసిడెంట్స్ సమావేశంలో పాల్గొంటారని వివరించారు. మూడవ రోజు ఘట్‌కేసర్‌లో జరిగే రాష్ట్ర కార్యవర్గ (స్టేట్ వర్కింగ్ కమిటీ), ఆఫీస్ బేరర్స్ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారని, మధ్యాహ్నం ఢిల్లీకి తిరుగు పయనమవుతారని చెప్పారు.

**తుంగభద్ర నీటి వాటాలపై నిజాలు వెల్లడించాలి**

తుంగభద్ర నది గేట్ల మరమ్మతుల వ్యవహారాన్ని బీజేపీ స్వాగతిస్తోందని, అయితే నీటి వాటాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రతిపాదించిన నవేలి రిజర్వాయర్, ఏపీలోని గుండ్రేవుల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు రావాల్సిన 15.9 టీఎంసీల నీటి వాటా దెబ్బతిని 5 టీఎంసీలు మాత్రమే వచ్చే ప్రమాదం కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్గతంగా ఏం మాట్లాడారో, రాష్ట్ర ప్రయోజనాలపై ఎలాంటి హామీలు తెచ్చారో ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. గతంలో కృష్ణా, గోదావరి బేసిన్లలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు.

**కాంగ్రెస్, ఎంఐఎంలవి నాటకాలు**

ఎన్ఆర్‌సీ, పౌరసత్వ సవరణ చట్టం అంశాలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నాటకాలు ఆడుతున్నాయని రామచందర్‌రావు మండిపడ్డారు. 2013 బాంబే హైకోర్టు తీర్పు ప్రకారం పాస్‌పోర్టు అనేది కేవలం ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి రుజువు కాదని స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఓటరు నమోదు ప్రక్రియలో ఆధారాల కోసం నిర్దేశించిన 12 రకాల పత్రాలలో పాస్‌పోర్టు కూడా ఒకటి మాత్రమేనన్నారు. బారిస్టర్ అయిన ఒవైసీ ప్రజలను తప్పుదారి పట్టించడం తగదని హితవు పలికారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం భారత పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని, రోహింగ్యాలు, బంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు ఓటు హక్కు కల్పించడం చట్టవిరుద్ధమని అన్నారు. తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో అనవసర భయభ్రాంతులు సృష్టించవద్దని కాంగ్రెస్, ఎంఐఎంలను ఆయన హెచ్చరించారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలి

మొదటిపేజీ తరువాయి

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనిత రామచంద్రన్, సినీ నటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి, అంతర్జాతీయ జిమ్నాస్ట్ అరుణ బుద్ధా రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ విభాగం అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఆరోగ్యవంతమైన యువతే తెలంగాణ భవిష్యత్తు**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు తెలంగాణలో ఎలాంటి స్థానం ఉండదని స్పష్టం చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు చట్టాలు మాత్రమే సరిపోవని, సమాజంలో అవగాహన, బాధ్యత, విలువలు పెరిగినప్పుడే నిజమైన మార్పు వస్తుందన్నారు. విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు అందరూ కలిసి యువతను ప్రభావితం చేయాలని అన్నారు. సినీ హీరో రామ్ పోతినేని, నటి మీనాక్షి చౌదరి యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని, జీవితంలో లక్ష్యాలను సాధించడమే నిజమైన విజయం అని పిలుపునిచ్చారు. క్రీడాకారిణి అరుణ బుద్ధా రెడ్డి కూడా క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారానే యువత ఉన్నత శిఖరాలను చేరుకోగలరని పేర్కొన్నారు.

**ప్రతి యువకుడు డ్రగ్స్‌కు 'నో' చెప్పాలి**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని సమాజం దూరం పెట్టకుండా వారికి సరైన మార్గం చూపాలని, మిత్రుల్లో ఎవరైనా డ్రగ్స్‌కు అలవాటు పడితే వారిని ఆ ప్రమాదం నుంచి బయటపడేలా సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రతి ఒక్కరూ సైనికులుగా మారాలని, యువత సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఆదర్శంగా నిలవాలని సూచించారు.

**డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వ సహకారం**

డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దేశంలోనే అత్యుత్తమ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థగా తీర్చిదిద్దిందని ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ అత్యంత సవాళ్లతో కూడుకున్న బాధ్యత అని అన్నారు. ఈ పోరాటంలో ఈగల్ బృందానికి అవసరమైన ప్రత్యేక వాహనాలు, డ్రగ్ డిటెక్షన్ పరికరాలు, ఆధునిక సాంకేతిక వనరులను తెలంగాణ ప్రభుత్వం అందించిందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ తమకు అండగా నిలుస్తోందని, ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**విజేతలకు బహుమతుల ప్రదానం**

డ్రగ్స్ వ్యతిరేక అవగాహనలో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, ఇతర పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సి.వి. ఆనంద్ తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

# అసైన్‌మెంట్ భూములు లాక్కుంటున్నారు

మొదటిపేజీ తరువాయి

మరిచిపోవద్దని, తమ భూములు ఇవ్వనందుకే లగచర్ల గిరిజనులపై పోలీసు కేసులు పెట్టించి, దాడులు చేయించి జైలులో పెట్టాడని ఆరోపించారు. గుండెపోటు వస్తే ఆయనకు వైద్యం అందించకుండా బేడీలు వేసి మరీ తిప్పించారన్నారు. పరిగి నియోజకవర్గంలో అడ్డగోలుగా అసైన్డ్ భూములు పేదల నుంచి లాక్కుంటామంటే ఒప్పుకునేదే లేదని హెచ్చరించారు. ఆ పేదలకు బీఆర్ఎస్ అండగా నిలబడుతుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వాటికి పట్టాలు ఇచ్చి పట్టాలకు ఇవ్వాల్సినంత నష్టపరిహారం ఇచ్చి రైతుల అంగీకారంతోని భూములు సేకరించే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ని నమ్మొద్దు.. నమ్మితే మోసపోతాము.. తెలంగాణ ఆగమయిపోతుందని కేసీఆర్ రెండేళ్ల కిందటే స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. పరిగి లాంటి వ్యవసాయ ఆధారిత నియోజకవర్గంలోని రైతన్నలకు రైతుబంధు ఇస్తామని చెప్పి పెన్షన్లు, పంటల బోనస్, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఘోరంగా మోసం చేసిండన్నారు. కేవలం రైతన్నలకే కాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేందుకు 420 హామీలు ఇచ్చి డిక్లరేషన్లు గ్యారెంటీలతో సబ్బండ వర్గాలను మోసం చేసిన్రు అని కేటీఆర్ విమర్శించారు. పరిగి నియోజకవర్గానికి గ్రావిటీతోని కేసీఆర్ నీళ్లు తీసుకొస్తామంటే రేవంత్ రూ.4,400 కోట్లతోని ప్రత్యేకంగా ఒక స్కీమ్ తయారు చేసి కమీషన్ల కోసం లిఫ్ట్ ఇరిగేషన్ పథకమని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తా అన్న రేవంత్ రెడ్డి కనీసం వారికి ఇస్తామన్న రూ.2,500లు ఇస్తే లక్షాధికారులు అవుతారన్నారు. ఒక్కొక్క ఆడబిడ్డకి రూ.లక్షన్నర వారి బ్యాంకు ఖాతాలో వేస్తే శాశ్వతంగా రాజకీయల నుంచి వైదొలుగుతానని సవాలు విసిరారు. పదేపదే కాంగ్రెస్ చేతిలో మోసపోకుండా మనం కలిసి కొట్లాడవలసిన అవసరం ఉన్నదని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. రాబందు పోవాలె□, రైతుబంధు కేసీఆర్ రావాల అన్న లక్ష్యంతో కలిసి పని చేద్దామన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిబాట పట్టించాలంటే అందరం సమష్టిగా ముందుకు పోవాల్సిన అవసరం ఉన్నదని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పరిగిలోని ప్రతి గ్రామానికి, తండాకి, ఇంటింటికీ కేసీఆర్ నీళ్ళిచ్చారన్నారు. ఈ సందర్భంగా ఎసఐఆర్‌తోపాటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపైన శ్రేణులకు కేటీఆర్ అవగాహన కల్పించారు. పార్టీ కార్యకర్తలపైన అరాచకాలు, అక్రమ కేసులు పెడితే ఆ పోలీస్ అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కార్యకర్తలకు దక్కాల్సిన గౌరవం, పదవుల అంశంలో తాను బాధ్యత తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టండి

**హైదరాబాద్,జూన్ 26:**

సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

మొదటిపేజీ తరువాయి



నుండి ఇస్లాం మతంలోకి మారిన వారికి వెనుకబడిన తరగతి ముస్లిం కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ హైకోర్టు కొట్టివేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం (వనుకబడిన తరగతి, అత్యంత వెనుకబడిన తరగతి, డినోటిఫైడ్ కవ్యునిటీస్, షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు ఇస్లాం మతంలోకి మారినప్పటికీ వారికి బీసీ ముస్లిం కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించవచ్చని పేర్కొంది. అంతేకాక ప్రభుత్వం నోటిపై చేసిన ఏడు ప్రత్యేక బీసీ ముస్లిం వర్గాలలో ఒకదానికి చెందిన సభ్యులుగా వారిని గుర్తిస్తూ కమ్యూనిటీ సర్టిఫికెట్లు జారీ చేయడానికి కూడా ఈ ఉత్తర్వు అనుమతించింది. తమిళనాడు ప్రభుత్వ భావన చట్టపరంగా, భావనాత్మకంగా పూర్తిగా తప్పని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతి ముస్లిం హోదాను పొందలేరని మేము నిర్ధారిస్తున్నాము.. మతం మారిన వ్యక్తి కేవలం ఒక ముస్లిం మాత్రమే అవుతాడు,. అంతే తప్ప ప్రత్యేక వర్గానికి చెందడు' అని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ప్రత్యేక వెనుకబడిన ముస్లిం వర్గాలలో అన్సార్, దక్కనీ ముస్లింలు, దుబేకుల, లబ్బాయి, మాపిళ్ళ, షేక్, సయ్యద్ ఎవరైనా కొత్తగా మతం మారిన వారిని సభ్యునిగా పరిగణించడం సాధ్యం కాదని, అందువల్ల వారు ఆ వర్గం కింద రిజర్వేషన్లు పొందడానికి అర్హులు కారని కోర్టు తేల్చి చెప్పింది. జూలై 2008లో జారీ చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా తమిళనాడులోని పైన పేర్కొన్న ఏడు ముస్లిం వర్గాలను ప్రత్యేక కేటగిరీలో చేర్చారు. అయితే, ఇతర సామాజిక వర్గాల నుండి ఇస్లాంలోకి మారిన వారికి కూడా ఈ సర్టిఫికెట్లు ఇవ్వాలనే 2024 నాటి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి న్యాయపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

# పీఆర్సీపై సీఎం హామీ అమలు చేయాలి

- **ఆరోగ్య పథకానికి అత్యుత్సాహంతో వేతనాల కోత**
- **2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్**
- **పెండింగ్ లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలి**
- **తరగతికి ఒక గది, ఒక టీచర్ ఉండాలి**
- **బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వాలి**
- **డీటీఎఫ్ రాష్ట్ర శాఖ డిమాండ్**

**హైదరాబాద్, జూన్ 26:**

అనేక వేదికల మీద ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే పీఆర్సీ కమిషన్ నుండి రిపోర్ట్ తెప్పించుకొని అమలుకు చర్యలు చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమయ్య అధ్యక్షతన హైదరాబాద్ లోని డిక్కీ హౌస్ లో శుక్రవారం జరిగింది. సోమయ్య, లింగారెడ్డి లు మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు అయిందని, ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పీఆర్సీ నివేదిక తెప్పించుకొని 1.07.2023 నుండి అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి విధి విధానాలు ఖరారు కాకముందే, పథకం అమలు చేయకుండానే, అధికారులు అత్యుత్సాహంతో ఉద్యోగుల వేతనాల నుండి కోత విధించడం సరికాదన్నారు. ఇప్పటికైనా సమగ్రమైన రీతిలో విధివిధానాలు రూపొందించి ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం పాత పెన్షన్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ అందుకు విరుద్ధంగా హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ లో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేసిన విధంగా తెలంగాణలో కూడా అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, పెన్షనర్ల ఆర్థిక బిల్లులు వెంటనే చెల్లించాలని, అదేవిధంగా పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలు విడుదల చేయాలనీ, సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పర్యవేక్షక పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తికి సంబంధించి అశాస్త్రీయంగా ఉన్న జీవో 25 ను సవరించాలని, ప్రాథమిక స్థాయిలో తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థానంలో, ఉన్నత పాఠశాలలన్నింటినీ సెమీ రెసిడెన్షియల్ గా మార్చి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు.

# మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

**హైదరాబాద్, జూన్ 26 :**

నగరంలో వరదల నివారణ, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా 'హైడ్రా' చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ.107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను సంస్థ కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని జలాశయాలుగానే కాక స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలు ఏర్పాటు చేయనున్నారు. పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలో బోటింగ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలపై కన్నేయాలి

మొదటిపేజీ తరువాయి

పాటించాలన్నారు. గతంలో విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ఆధారంగా కనీస ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై విజయశాంతి స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలను గౌరవించి వాటిని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి విద్యా సంవత్సరానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సద్వినియోగం అయ్యేలా, అర్హులైన విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోని విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో కూడిన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- **సీఎంవో నుంచి అజిత్ రెడ్డి ఔట్**
- **కొత్తగా ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా నియామకం**
- **ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్**
- **అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్**

**హైదరాబాద్,జూన్ 26:**

రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ అధికారి ఎన్.శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డికి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సబ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె.చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. కాగా, ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సీఎస్‌గా ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్/ఎక్స్‌ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది.

# హైదరాబాద్‌లో తొలి డేటా సెంటర్ సిటీ

**హైదరాబాద్, జూన్ 26:**

సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హైఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్‌అండ్‌ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హైస్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీఎస్‌ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్‌ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే

# ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం



తూప్రాన్ జూన్ 26 సిరి న్యూస్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పదవ వార్డు బ్రాహ్మణపల్లి లో శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలోనూతన ఇంటికి గృహప్రవేశం చేయడం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు నర్సారెడ్డి మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ పార్టీ ఆశయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలలో భాగంగా ఈరోజు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని ఇంటి యజమాని చింత మంజుల రాజు సొంత ఇంటి కలను నెరవేరుస్తూ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం పాల్గొనడం జరిగిందని అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా సహాయ సహకారాలు అందిస్తానని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి భగవాన్ రెడ్డి నారాయణ గుప్త రవీందర్ గుప్తా వేణు మల్లేష్ సిద్ధ గౌడ్ కృష్ణ సత్యనారాయణ శ్రీధర్ గౌడ్ రవి లక్ష్మణ్ బిక్షపతి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




తూప్రాన్ జూన్ 26 సిరి న్యూస్

తూప్రాన్ పట్టణానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులను గజ్వేల్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అందజేశారు నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పార్టీగా పేరున్న పార్టీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలతో పాటు గృహజ్యోతి ఇందిరమ్మ ఇండ్లు కొత్త పింఛన్లు రేషన్ కార్డులు ఉచిత బస్సు ప్రయాణం కార్పొరేట్ హాస్పిటల్ లో వైద్యం చేయించుకోలేని పేదవారికి మధ్యతరగతి వారికి సీఎం ఆర్ఎఫ్ నిధి నుండి దవాఖాన ఖర్చులకోసం సహకారాలు అందిస్తున్నామని అదేవిధంగా తూప్రాన్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు నరసింహారెడ్డికి 65 వేల రూపాయల చెక్కును తూప్రాన్ మాజీ చైర్మన్ నందాల శ్రీనివాస్ కుమార్తె ఫణి శ్రీ కి 50 వేల రూపాయల చెక్కును అందించినట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ మాజీ చైర్మన్ నందాల శ్రీనివాస్ సిద్ధి రాములు వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు

# వియత్నాంలో గీతం అధ్యాపకుడి ప్రతిభ..

- ఏఐ బూట్ క్యాంప్ కు మెంటర్ గా డాక్టర్ నిరంజన్ అప్పస్వామి

పటాన్చెరు, జూన్ 26 (సిరి న్యూస్):



గీతం డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన అధ్యాపకుడు డాక్టర్ నిరంజన్ అప్పస్వామికి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. వియత్నాంలోని హోచి మిన్ సిటీలో నిర్వహిస్తున్న ఏఐ లాంచ్ ప్యాడ్ బూట్ క్యాంప్‌కు మెంటర్, రిసోర్స్ పర్సన్‌గా ఆయనను ఆహ్వానించారు. జూన్ 22 నుంచి జూలై 4 వరకు జరిగే ఈ రెండు వారాల శిక్షణా కార్యక్రమంలో వియత్నాం విద్యార్థులకు కృత్రిమ మేధస్సుపై శిక్షణ అందిస్తున్నారు.వియత్నాంలోని ట్రూంగ్ కావో డాంగ్ వియెన్ డాంగ్ విద్యాసంస్థలో జరుగుతున్న ఈ బూట్ క్యాంప్‌లో డాక్టర్ నిరంజన్ పాల్గొనడం ఇది ఆరోసారి. దీంతో గీతం, వియెన్ డాంగ్ విద్యాసంస్థల మధ్య విద్యా సహకారం మరింత బలోపేతమవుతోంది.72 గంటలపాటు సాగే ఈ బూట్ క్యాంప్‌లో ఏఐ ప్రాథమిక సూత్రాలు, పైథాన్, మెషిన్ లెర్నింగ్, ప్రాక్టికల్ ఏఐ అప్లికేషన్లు, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, డిప్లాయ్‌మెంట్ వంటి అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందిస్తున్నారు. కోడింగ్‌పై ముందస్తు అనుభవం లేకున్నా విద్యార్థులు వాస్తవ ప్రపంచ అవసరాలకు అనుగుణంగా ఏఐ పరిష్కారాలను రూపొందించేలా శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రత్యేకత.సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో నిపుణుడైన డాక్టర్ నిరంజన్ అప్పస్వామి ఇప్పటివరకు 22 పాఠ్య పుస్తకాలు రచించారు. ఐ ట్రిపుల్ ఈ సైబర్ సెక్యూరిటీ స్పెషల్ టెక్నికల్ కమ్యూనిటీ కార్యదర్శిగా, పలు అంతర్జాతీయ సాంకేతిక వేదికల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఈ అవకాశం గీతం అధ్యాపకుల ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న గుర్తింపునకు నిదర్శనమని విశ్వవిద్యాలయ యాజమాన్యం పేర్కొంది.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఓటర్ల జాబితాలో ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదు.
- బీఎల్‌వోలు, పార్టీ నాయకులతో సమన్వయం చేసుకోవాలి.
- మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి.

మెదక్,జూన్,26(సిరి న్యూస్)






ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ఓటర్ల జాబితాలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో మాట్లాడారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా మరోసారి ఓటర్లను నేరుగా కలిసే అవకాశం లభించిందన్నారు. ప్రతి ఓటరిని కలిసి వారి ఓటు నమోదును నిర్ధారించడం పార్టీ కార్యకర్తల బాధ్యతగా భావించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ఓటర్ల నమోదుపై కార్యకర్తలు, నాయకులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వార్డుల్లో ఓటర్ల నమోదుకు సంబంధించిన సందేహాలు ఉంటే పార్టీ నాయకులు, బీఎల్‌వో ఏజెంట్లను సంప్రదించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకోవడం వల్ల స్థానిక ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో వెంటనే బీఎల్‌వోలను కలిసి నమోదు ప్రక్రియ పూర్తి చేయించాలని తెలిపారు.మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గంలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని కోరారు. వర్గాలకు అతీతంగా ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పార్టీ ఆదేశాలను అమలు చేయాలని సూచించారు.మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిర్దేశించిన గడువులోగా బీఎల్‌వోలను కలిసి ప్రతి అర్హుడి ఓటు నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యే వరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యం. దేవేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ లు అరెళ్ళ. మల్లికార్జున్ గౌడ్,బట్టి జగపతి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు బట్టి.ఉదయ్ కుమార్,దీపక్ కుమార్ జుబేర్ అహ్మద్, సోహెల్,మాజీ కౌన్సిలర్లు భీమరి. కిషోర్,మాయ మల్లేశం ఆర్కే. శ్రీనివాస్, నాయకులు ప్రభు రెడ్డి,కృష్ణ గౌడ్,సురేందర్ గౌడ్, అంజాగౌడ్, కిష్టయ్య, శ్రీనివాస్ రెడ్డి,మాణిక్య రెడ్డి, లక్ష్మీనా రాయణ, ఇందాద్, మాయ.శ్రీనివాస్,ఇస్మాయిల్, సాయి, బీఎల్ఏలు, నియోజకవర్గంలోని మండలాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేగం పుంజుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఎస్ ఐ ఆర్ సర్వేకు సహకరించండి
- వచ్చే నెల 24 వరకు ఎస్ఐఆర్ సర్వే
- తాసిల్దార్ వెంకటేష్

అమీన్పూర్ జూన్ 26 సిరి న్యూస్

అమీన్పూర్ మండల పరిధిలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించినట్లు తహసిల్దార్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ప్రక్రియ సుదీర్ఘంగా, సాధన ఉందని వచ్చే నెల 24 వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగుతుందని, ఆయన స్పష్టం చేశారు. సహకారం తప్పనిసరి సర్వే కోసం వచ్చిన రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులకు మరియు సిబ్బందికి,ప్రజలు యాజమాన్లు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. ఆందోళన వద్దు సర్వే నిర్వాహనపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని పారదర్శకంగా గడువు లోపల పక్రీను పూర్తి చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి ఓటర్ నమోదు సవరణలకు సంబంధించిన పారాలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు.



శుక్రవారం ఐలాపూర్ తండా, జయలక్ష్మి కాలనీ సాయి కాలనీ పరిధిలో ఓటర్ సవరణ కార్యక్రమం కొనసాగింది అని తెలిపారు.

# కాలువల్లో ఆయిల్ వ్యర్థాల కలకలం..!

- పర్యావరణ కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు

రామచంద్రపురం, జూన్ 26 (సిరి న్యూస్):

బీహెచ్ఈఎల్ (ఏఐఈ) ప్రాంతంలోని కొన్ని ఆటోమొబైల్ సర్వీస్ స్టేషన్లు, అనుబంధ సంస్థలు వ్యర్థ ఇంజిన్ ఆయిల్, గ్రీస్, పెట్రోలియం అవశేషాలు, ఇతర ప్రమాదకర రసాయన వ్యర్థాలను ప్రజా మురుగు కాలువల్లో అక్రమంగా విడుదల చేస్తున్నాయని సత్యవతి కత్రగడ్డ ఆరోపించారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసిన ఆమె, ఈ కాలుష్యం వల్ల ప్రజారోగ్యం, పర్యావరణం, భూగర్భ జలాలు, ఆస్తులకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ, కాలువల్లో ఆయిల్, గ్రీస్ పేరుకుపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని మురుగునీరు రోడ్లపైకి, సమీప వ్యాపార సంస్థల్లోకి ప్రవహిస్తోందని తెలిపారు. ఈ కాలుష్యం తాగునీటి వనరులకు వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రజలు ప్రమాదకర రసాయనాల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాక, కాలువల్లో పేరుకుపోయిన పెట్రోలియం వ్యర్థాలు అత్యంత మండే స్వభావం కలిగి ఉండటంతో చిన్న నిప్పురవ్వ కూడా భారీ అగ్నిప్రమాదానికి దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.



దీనివల్ల సమీపంలోని వర్క్‌షాపులు, వ్యాపార సముదాయాలు, వాహనాలు, నివాస ప్రాంతాలకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. ప్రభావిత ప్రాంతంలో వెంటనే తనిఖీలు నిర్వహించి, కాలుష్యానికి కారణమైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కాలుష్య నివారణకు అత్యవసర చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలిని కోరారు. ఈ ఫిర్యాదును అత్యవసరంగా పరిగణించి తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# సింగరేణి కోసం కాంగ్రెస్ గళం..

- సింగరేణి నిర్లక్ష్యంపై కాంగ్రెస్ ఫైర్..
- బీఆర్ఎస్ పాలనపై రఘునాథ్ రెడ్డి ధ్వజం..
- బాల్క సుమన్‌పై ఘాటు విమర్శలు..
- మంత్రి వివేక్ కృషికి ప్రశంసలు..

మంచిర్యాల జూన్ 26 ( సిరి న్యూస్)



గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, రాజకీయ జోక్యంతో సంస్థ మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి విమర్శించారు. మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలన, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సింగరేణిలో కార్మికులకు టిబీజీకేఎస్‌కు ఆదరణ లేకపోవడం వల్లే గత కార్మిక సంఘ ఎన్నికల్లో ఆ సంఘం పోటీ చేయలేదన్నారు. ముఖ్యమంత్రి కుమార్తె గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ సింగరేణి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇసుక రీచ్‌ల పేరుతో ప్రాంతీయ వనరులను దోచుకున్నారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించారని బాల్క సుమన్‌పై విమర్శలు చేశారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రకటించిన కొత్త భూగర్భ గనుల హామీ అమలు కాలేదని, ఓపెన్‌కాస్ట్ గనులకు ప్రత్యామ్నాయంగా చేపడతామని చెప్పిన చర్యలు మాటలకే పరిమితమయ్యాయని అన్నారు. సింగరేణి ఆస్తులను ధ్వంసం చేసేలా స్థానిక నాయకులు, యువతను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.మంత్రి వివేక్ వెంకటస్వామి సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, కొత్త పరిశ్రమల స్థాపన, గిగ్ కార్మికులకు ప్రత్యేక చట్టం, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల వేతనాల పెంపు, రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి శిక్షణ కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అలాగే సింగరేణి సహకారంతో జర్మనీలో ఉపాధి అవకాశాల కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా మందమర్రిలో టామ్‌కామ్ ఆధ్వర్యంలో జర్మన్ భాష శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా, పట్టణ కమిటీ నాయకులు, యువజన, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పొన్నారంలో నీటి సమస్యకు గుడ్‌బై..





- పొన్నారంలో కొత్త బోర్‌వెల్‌లు..
- రెండు వార్డులకు తాగునీటి ఊరట..
- మంత్రి వివేక్, ఎంపీ వంశీ సహకారం..
- సర్పంచ్ మధు ఆధ్వర్యంలో ప్రారంభం..

**మంచిర్యాల జిల్లా జూన్ 26 (సిరి న్యూస్)**

పొన్నారం గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారంగా రెండో, మూడో వార్డుల్లో నూతన బోర్‌వెల్‌లను ప్రారంభించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికంగా హర్షాతిరేకం కలిగించింది. చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ఆశీస్సులతో గ్రామ సర్పంచ్ పెంచల మధు ఆధ్వర్యంలో బోర్‌వెల్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల దాహార్తిని తీర్చే దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంచల అమృత, వార్డు సభ్యులు మేకల వంశీ, సూరిమిల్లా పద్మ శ్రీనివాస్, బోర్లకుంట లక్ష్మణ్, బొజ్జ రాజకుమారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కదారి జీవన్ కుమార్, ఆదిల్‌పేట సర్పంచ్ నెండుగురి పున్నం, మండల ఉపాధ్యక్షుడు మాస్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు పెంచల రాయలింగు, పొక్కూరి సమ్మయ్య, నీలం ఆనంద్, బొజ్జ రాములు, వేల్పుల రాజారాం, గోస్కే వినయ్, నర్సిగోజు తిరుపతి, కొట్టే సంపత్, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు గోగు సుమలత, తిరుమలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు..

**రామచంద్రపురం, జూన్ 26 (సిరి న్యూస్):**



త్యాగం, ఐక్యత, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని రామచంద్రా పురంలో నిర్వహించిన వేడుకలు భక్తి వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని పీర్లను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ మొహర్రం త్యాగం, ధర్మం, న్యాయం, మానవతా విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పండుగ సమాజంలో ఐక్యతను బలపరిచే సందేశాన్ని ఇస్తుందని తెలిపారు.అలాగే కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మొహర్రం సమాజంలో సోదరభావం, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్ర పండుగ అని తెలిపారు. భారతదేశ గొప్పతనం భిన్నత్వంలో ఏకత్వమని, అన్ని మతాల ప్రజలు కలిసి సౌహార్దంగా జీవించడమే నిజమైన సామరస్యానికి నిదర్శనమని అన్నారు.అనంతరం మత పెద్దలు, నిర్వాహకులు నేతలను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేశ్ యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రేమ వివాహానికి ఆర్థిక అండగా సదానందం..

- అంతర్‌కుల వివాహానికి రూ.25,116 సాయం..
- తస్లీమా కుటుంబానికి బండి సదానందం అండ..
- జూలై 2 వివాహానికి ఆహ్వానం..
- సామాజిక ఐక్యతకు ప్రోత్సాహం..

**మంచిర్యాల, జూన్ 26 (సిరి న్యూస్)**



మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన నృత్య కళాకారిణి తస్లీమా అంతర్‌కుల వివాహానికి సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బండి సదానందం యాదవ్ రూ.25,116 ఆర్థిక సహాయం అందజేశారు. సమాజంలో అంతర్‌కుల వివాహాలను ప్రోత్సహిస్తూ యువతకు ఆదర్శంగా నిలిచేలా ఈ సహాయం అందించడం విశేషంగా నిలిచింది. జూలై 2న జరగనున్న తస్లీమా వివాహానికి ఆహ్వానించేందుకు ఆమె కుటుంబ సభ్యులు బండి సదానందం యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివాహ వేడుక విజయవంతంగా జరగాలని ఆకాంక్షించిన ఆయన, వివాహ ఖర్చులకు తన వంతు సహాయంగా రూ.25,116 నగదును అందజేశారు. ఈ సందర్భంగా బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ, కులాలకు అతీతంగా పరస్పర అవగాహన, ప్రేమ, విశ్వాసంతో జరిగే వివాహాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి మంచి నిర్ణయాలు తీసుకునే యువతను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తస్లీమా కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానించారు.

# విద్యాశాఖపై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు..

## విద్యాహక్కు చట్టం అమలు చేయాలంటూ నిరసన..





- విద్యాశాఖ అధికారుల దిష్టిబొమ్మ దహనం..
- ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై మండిపాటు..
- 25% సీట్లు పేదలకు కేటాయించాలని డిమాండ్..

**మంచిర్యాల, జూన్ 26 (సిరి న్యూస్)**

రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాలు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో విద్యాశాఖ అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశాయి. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ (టీవీయూవీ), చేరాల వంశీ (జేవీఎస్) మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం ప్రతి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగులు, పేద విద్యార్థులకు కేటాయించాలని చట్టం స్పష్టం చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు అమలు చేయకుండా రాజ్యాంగ స్ఫూర్తిని అవమానపరుస్తున్నారని ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలకు అధికారులు అనుమతులు ఇస్తుండటంతో ఫీజుల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఫీజులను నియంత్రించి, విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి సతీష్ మాదిగ (ఎంఎస్ఎఫ్), దుర్గం మనీష్, ముంజంకార్ రితిక్, రౌతు శంకర్ కుమార్, శశి, ప్రశాంత్, శేఖర్ పాల్గొన్నారు..

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక మొహర్రం..




**పటాన్‌చెరు, జూన్ 26 (సిరి న్యూస్):**

మొహర్రం పర్వదినం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గంగా–జమున తెహజీబ్ సంస్కృతికి మొహర్రం ఒక చిహ్నమని ఆయన పేర్కొన్నారు.మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని జీఎంఆర్ యువసేన నాయకుడు షకీల్ ఆధ్వర్యంలో శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగనిరతి, సహనం మొహర్రం ప్రధాన సారాంశమని తెలిపారు. పీర్ల రూపంలో అమరవీరుల సంస్మరణగా జరిగే ఈ పర్వదినం అన్ని మతాల ఐక్యతకు, సఖ్యతకు ప్రతీక అని అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, వెంకటేష్, మిరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మొహర్రం వేళ సామరస్య సందేశం..

మొహర్రం వేళ శర్బత్ పంపిణీ..

మత సామరస్యానికి పెద్దపీట..

మాజీ కార్పొరేటర్ నరసింహ యాదవ్ శుభాకాంక్షలు..

అలీ కాంప్లెక్స్ లో ఘన కార్యక్రమం..





**బోయిన్ పల్లి, జూన్ 26 ( సిరి న్యూస్ )**

మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని బోయిన్‌పల్లి ఓల్డ్ డివిజన్‌లో మత సామరస్యం, సోదరభావాన్ని చాటుతూ శర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలీ కాంప్లెక్స్ వద్ద నాసిర్ రజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొహర్రం శర్బత్ పంపిణీ కార్యక్రమం స్థానిక ప్రజల విశేష ఆదరణ పొందింది. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు శర్బత్ పంపిణీ చేశారు. అనంతరం మొహర్రం పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, మొహర్రం త్యాగం, ధర్మం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావం, ఐక్యతతో జీవించడమే సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరూ కలిసికట్టుగా జీవించడం భారతీయ సంస్కృతికి గొప్ప నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, సయ్యద్ సలీం, సయ్యద్ వసీమ్, మాము, శ్యాంసుందర్, బుర్రి యాదగిరి పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై శర్బత్ స్వీకరించి మొహర్రం పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, సౌహార్ద వాతావరణంలో విజయవంతంగా ముగిసింది..

# ఎన్యూమరేషన్ ఫారం ఆన్‌లైన్ ప్రారంభం

తహశీల్దార్ సరస్వతి

ఇంటి నుంచే ఓటర్ వివరాల నమోదుకు అవకాశం

**రామచంద్రపురం, జూన్ 26 (సిరి న్యూస్):**

ఎలక్ట్రానిక్ ఎన్యూమరేషన్ ఫారం పూరింపు విధానం ఆన్‌లైన్‌లో ప్రారంభమైనట్లు తహశీల్దార్ సరస్వతి తెలిపారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఓటర్ల సౌకర్యార్థం ఈ కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆమె పేర్కొన్నారు.www.voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా ఓటర్లు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.ఈ ప్రక్రియలో మొదటగా ఓటరు తన ఓటర్ గుర్తింపు కార్డు నంబర్‌తో లాగిన్ కావాల్సి ఉంటుంది. అనంతరం నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఒకసారి వినియోగించే పాస్‌వర్డ్ ద్వారా ధృవీకరణ పూర్తవుతుంది. ధృవీకరణ అనంతరం “ఎన్యూమరేషన్ ఫారం పూరించండి” అనే ఎంపిక ద్వారా అవసరమైన వివరాలను నమోదు చేయవచ్చు.ఫారం సమర్పించిన తర్వాత ఎలక్ట్రానిక్ సంతకం ప్రక్రియను కూడా ఒకసారి వినియోగించే పాస్‌వర్డ్ ద్వారా పూర్తి చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.సమర్పించిన ఫారమ్‌లను సంబంధిత బూత్ స్థాయి అధికారి పరిశీలించనుండగా, అవసరమైతే భౌతిక ధృవీకరణ కూడా చేపట్టే అవకాశం ఉందని తహశీల్దార్ సరస్వతి పేర్కొన్నారు.ఓటర్ల సౌకర్యార్థం ఇంటి వద్ద నుంచే నమోదు ప్రక్రియను సులభతరం చేయడమే ఈ ఆన్‌లైన్ విధానం ప్రధాన ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు.

# సీఎం సహాయనిధి నిరు పేదలకు గొప్ప వరం

## నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 26, (సిరి న్యూస్) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లికి చెందిన బొల్లం సంజీవరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి, తెలంగాణ శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ – ఎల్ఓసి ) ద్వారా వైద్య చికిత్స, శస్త్రచికిత్స కోసం రూ.2,75,000 మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మంజూరైన సీఎంఆర్ఎఫ్–ఎల్ఓసీ పత్రాలను బాధితుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి జీవితాల్లో కొత్త ఆశను నింపుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తాం అని తెలిపారు.

# ఎస్సీ బస్తీలో ప్రజల సమస్యలపై మాజీ సర్పంచ్ కావలి గణేష్ పర్యటన



**దుండిగల్, జూన్ 26, (సిరి న్యూస్) :**

దుండిగల్ డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామం ఎస్సీ బస్తీలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మాజీ సర్పంచ్ కావలి గణేష్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల కొరత, పారిశుధ్య లోపాలు, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం, దోమల బెడద, మురుగు కాలువల శుభ్రత వంటి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన ప్రతి సమస్యను ఓర్పుగా విన్న కావలి గణేష్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దత్తూరిపల్లి నవీన్, సిరిగల్ల బాబు, యాప్రల్ బాలరాజ్, జోగు రంజిత్, జోగు బాలకృష్ణ, నిజాంపేట్ కిరణ్, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు ఎస్సీ బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

# అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేపు స్కాలర్షిప్ టెస్ట్



**మిరుదొడ్డి, జూన్ 26, (సిరి న్యూస్):**

మిరుదొడ్డి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఎస్సై సతీష్ చేతుల మీదుగా శుక్రవారం అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహణ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అఖిల రాజ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అస్క స్వామి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులు, నిరుద్యోగులకు ఉచితంగా ఫ్రీ కోచింగ్, ఉచిత మెటీరియల్ అందిస్తూ, లక్ష్యసాధకులుగా తీర్చిదిద్దడానికి ఆదివారం దుబ్బాక వాగ్దేవి జూనియర్ కాలేజీలో నిర్వహించే స్కాలర్షిప్ టెస్ట్ కు బార్ కోడ్ స్కాన్ ద్వారా తమ పేరు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఆర్థిక సాయంతో పాటు ఫ్రీ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గొల్ల విజయ్ కుమార్, పూస రాజు, అఖిల రాజ్ ఫౌండేషన్ నాయకులు ధర్మారం రాజు, అల్లిబిల్లి రాజు, ఎద్దు నరేందర్, నక్క రాజం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారే

**దమ్మపేట, జూన్ 26, (సిరి న్యూస్):** అశ్వారావుపేట శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలలో భాగంగా “కళ్యాణ లక్ష్మి" పథకం కింద 32 మంది లబ్దిదారులకు రూ.32,03,712/– చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు, అమ్మాయిల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక ఒత్తిడిని తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు, ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వలనా వేలాది కుటుంబాలు లాభపడుతున్నాయని అన్నారు, సమాజంలో అమ్మాయిల పట్ల గౌరవం పెరగడానికి, బాల్య వివాహాలు తగ్గడానికీ కూడా ఈ పథకం దోహదపడుతోందని ఎమ్మెల్యే వివరించారు, ప్రతి అర్హులైన లబ్దిదారుడు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లబ్దిదారులు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# బాలానగర్‌లో ఎస్ఐఆర్ షురూ..

- ఇంటింటికీ ఎస్ఐఆర్ సర్వే..
- అర్హుల ఓట్ల నమోదు వేగం..
- ప్రజల సహకారం కోరిన అధికారులు..
- ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి..

**బాలానగర్, జూన్ 26 ( సిరి న్యూస్ )**

బాలానగర్ మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా అధికారులు ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో విస్తృతంగా వివరాలను సేకరిస్తున్నారు. ప్రజలు ఈ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. బాలానగర్ మండల పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాలు, కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, కొత్తగా అర్హత పొందిన వారి వివరాలను నమోదు చేస్తూ, అవసరమైన పత్రాలను పరిశీలిస్తున్నారు. అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు, అనర్హులైన వారి వివరాలను కూడా పరిశీలించి జాబితాను కచ్చితంగా రూపొందించే చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి కుటుంబం నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరిస్తూ, ప్రజలకు ఓటరు జాబితా ప్రాధాన్యతను వివరిస్తున్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని గ్రామాలు, కాలనీల్లో తిరుగుతూ



అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. ఓటర్లకు అవసరమైన సూచనలు అందిస్తూ, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.మండలంలోని ప్రతి అర్హుడైన ఓటరు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని, అధికారులకు సరైన వివరాలు, అవసరమైన పత్రాలు అందించి సహకరించాలని ఎన్నికల శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు..

# భక్తి వెల్లువలో మొహరం వేడుకలు.

- కళకళలాడిన మందమర్రి..
- మందమర్రిలో భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు..
- పీర్ల దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు..
- శర్బత్, అన్నదాన సేవలతో ఆకట్టుకున్న నిర్వాహకులు..
- కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తులో ప్రశాంతంగా వేడుకలు..



**మంచిర్యాల జూన్ 26 (సిరి న్యూస్)**

మందమర్రి పట్టణంలో మొహరం వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ ఆశూర్‌ఖానాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, పీర్లను దర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని ప్రధాన వీధులు భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మొహరం సందర్భంగా యువకులు సంప్రదాయ విన్యాసాలు ప్రదర్శించగా, భక్తులు పీర్లకు మొక్కులు చెల్లించి శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. పలుచోట్ల శర్బత్, మంచినీరు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు. హిందూ, ముస్లిం సోదరులు కలిసి వేడుకల్లో పాల్గొనడం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించడంతో



మందమర్రి పట్టణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది..

# నిండు ప్రాణానికి రెండు చుక్కలు...

- పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి...
- రేపే పల్స్ పోలియో కార్యక్రమం.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జూన్, 26(సిరి న్యూస్)**

పోలియో వ్యాధి నివారనే లక్ష్యం గా అప్పుడు పుట్టిన బిడ్డ నుండి 05 ఏళ్ళ పిల్లలందరికి తప్పకుండ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.మెదక్ జిల్లాలో 75,496 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు 457 బూతులు మొబైల్ టీంలు , ట్రాన్సిస్ట్ టీమ్స్, 872 వ్యాక్సిన్ పర్యవేక్షణ వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ నెల 28న



దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయన్నారు.చిన్నారులు నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయన్నారు.0 నుండి 5 ఏళ్ల వయసు గల చిన్నారులు ఎలాంటి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న విధిగా రెండు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని తెలిపారు.ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.ఈ నెల 28, 29, 30 తేదీలలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాక్సిన్ ఇస్తామని జిల్లా నందుగల అన్ని గ్రామ పంచాయతీలలో అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలలలో ఆదివారం రోజు పోలియో చుక్కలు వేస్తామన్నారు సోమవారం మంగళ వారలలో ఇంటింటికి తిరిగి మిగతా పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని మీ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు.

# వనమహోత్సవంలో భాగంగా దమ్మపేట డివైడర్ పై మొక్కలు నాటారు

- మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం -ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, జూన్ 26, (సిరి న్యూస్):**

దమ్మపేట మండల కేంద్రంలో గల ప్రధాన రహదారి సెంట్రల్ లైటింగ్ డివైడర్ పై తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించడం మరియు పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా పర్యావరణ యజ్ఞాన్ని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ మొక్కలు నాటి అధికారికంగా సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు తో కలిసి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి మరియు భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, ఎ.ఎం.సి చైర్మన్ వాసం రాణి శ్రీను, సి.ఐ నాగరాజు, ఎస్.ఐ రాజేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్, కే.వి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాక రమేష్, దిశ కమిటీ సభ్యులు సొంగా ఏసుమణి, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, చాట్ల శ్రీనివాసరావు, బద్దె వెంకటలీల రాంబాబు, పూనెం పోలమ్మ షేక్ గోరె, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, గ్రామస్తులు అత్తులూరి వెంకట రామారావు, దాసరోజు రామబ్రహ్మం, పగడాల కృష్ణారావు, వనమాల శ్రీనివాసరావు వసంత, చిన్నశెట్టి గోపి, శంకరవర అయ్యప్ప, రొయ్యల కుమార్, కొయ్యల ప్రసాద్, చిలకా శ్రీను, ఉల్వాల రాంబాబు, అన్నవరపు నాగేంద్రరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ సర్కిల్‌లోని డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలి

## సిపిఎం డిమాండ్

**కుత్బుల్లాపూర్, జూన్ 26,(సిరిన్యూస్):**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బండారి లేఔట్ డివిజన్‌లో, నిజాంపేట్–బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం సిపిఎం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, నివాస ప్రాంతాల మధ్యలో చెత్తను డంపింగ్ చేయడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డుకు ఆనుకుని మహిళా డిగ్రీ కళాశాల నిర్మించి ఇప్పటికే ప్రవేశాలు ప్రారంభించారని, కళాశాలకు వచ్చే విద్యార్థినులు డంపింగ్ యార్డును చూసి భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ చెత్త మొత్తం కళాశాల ప్రాంగణంలోనే ఉన్నట్లుగా కనిపిస్తోందని విమర్శించారు. బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల నుంచి మహిళా డిగ్రీ కళాశాల మీదుగా నిజాంపేట్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీల వరకు రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డును అనుకూలమైన ప్రాంతానికి తరలించి, ప్రస్తుతం ఉన్న ప్రదేశాన్ని పూర్తిగా శుభ్రపరచడంతో పాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# చలికాలంలో బొప్పాయితో లాభాలు

చలికాలంలో సాధారణంగానే ఎక్కువగా అనారోగ్యానికి గురవుతూ ఉంటారు. ఎందుకంటే చలికాలంలో రోగ నిరోధక శక్తి వేగంగా తగ్గిపోతుంటుంది. చల్లని వాతావరణంలో ఉండడంతో రోగాలు ఎక్కువగా వస్తుంటాయి. దగ్గు, జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతుంటాము. రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి. బొప్పాయి పండులో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. దీనిని తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల చలికాలంలో ఎక్కువగా ఇబ్బంది పెట్టే జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు. అలాగే ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా మీ దరికి చేరవు. చలికాలంలో బొప్పాయి తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. ఇది తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది మీ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ఈ బొప్పాయి తినడం వల్ల నీరసం తగ్గిపోతుంది. జీర్ణక్రియ కూడా మెరుగ్గా పని చేస్తుంది. బొప్పాయి పండు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా పని చేస్తుంది. మలబద్దకం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు దూరమవుతాయి. బొప్పాయిలో పపైన్ ఎంజైమ్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కావడానికి సహాయపడతాయి. మలబద్దకాన్ని నివారిస్తాయి. బరువును నియంత్రిస్తుంది ఈ పండులో ఎక్కువగా ఫైబర్ ఉంటుంది. అలాగే చాలా తక్కువ మొత్తంలో క్యాలరీలు ఉంటాయి. దీని కారణంగా దీనిని తినడం వల్ల త్వరగా జీర్ణం కావడంతో పాటు, తిన్న ఆహారం కూడా తక్షణమే జీర్ణమై శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. తద్వారా ఎక్కువ ఆహారం తినకుండా ఉండొచ్చు. ఫలితంగా బరువు కూడా నియంత్రణలో ఉంటుంది.





# గోర్లు ఎప్పుడెప్పుడు కత్తిరించొద్దంటే

గోర్లను ఏ రోజు పడితే ఆ రోజు ఏ టైం పడితే ఆ టైంలో కట్ చేస్తే దారుణమైన ఫలితాలను చివిచూడాల్సి వస్తుందని చాలా మంది చెబుతుంటారు. పెద్దలైతే రాత్రి సమయంలో గోళ్లు కత్తిరించవద్దని సూచనలు చేస్తుంటారు. గోళ్లను కట్ చేయడానికి కూడా కొన్ని రూల్స్ ఉన్నాయి. బ్యాడ్ టైంలో గోర్లు కట్ చేస్తే ఇంట్లో చెడు శక్తులు మేల్కొంటాయని, ప్రతికూల శక్తి ఆధిపత్యం చెలాయిస్తుందని అంటుంటారు. అందుకే మన పెద్దలు తరచుగా గోళ్లు కట్ చేయకు,ఈ రోజు కట్ చేయకు అని చెప్తుండటం మనం మన ఇళ్లల్లో చూసి ఉంటాం. వారు ఏదో ఊరికే చెప్పడం లేదు. దాని వెనుక పెద్ద కథే ఉంది. గోరు కత్తిరించడానికి సంబంధించిన జ్యోతిషశాస్త్ర నియమాల గురించి ఇప్పుడు చూద్దాంజ్యోతిష్య శాస్త్రం ప్రకారం వారంలో 3 రోజులు పొరపాటున కూడా గోర్లు కత్తిరించకూడదు. మంగళవారం హనుమంతుని భక్తికి సంబంధించిన రోజుగా భావిస్తారు. ఈ రోజున మీ గోర్లు కట్ చేస్తే అది మీ ధైర్యాన్ని తగ్గిస్తుంది. గురువారాన్ని దేవ గురువు బృహస్పతి దినం అంటారు. ఈ రోజున గోర్లు కత్తిరించడం వల్ల కడుపు సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. మీ విద్యకు కూడా ఆటంకం కలుగుతుంది, మీ జ్ఞానం తగ్గుతుంది. ఇక శనివారం శని దేవుడికి అంకితం చేయబడింది. శనివారం గోర్లు కత్తిరించడం వల్ల ఇంట్లో పేదరికం ప్రబలుతుందని, చేసే పనికి ఆటంకం ఏర్పడుతుందని నమ్ముతారు.



# త్వరలోనే క్యాన్సర్ కు రష్యా వ్యాక్సిన్

**త్వరలో ఈ క్యాన్సర్ వ్యాక్సిన్ విడుదల చేస్తామని రష్యా ప్రకటించింది. ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. చాలా ఏళ్ల తర్వాత ఎట్టకేలకు అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధికి పరిష్కారాన్ని కనుగొన్నారు శాస్త్రవేత్తలు. నయం లేని క్యాన్సర్ వ్యాధిని నివారించే మార్గాన్ని కనిపెట్టారు. ప్రస్తుతానికి క్యాన్సర్ కు చికిత్సలేదు. ఒకవేళ పలు చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ, సాధారణ వ్యక్తి తన ఇల్లు, భూమిని అమ్ముకోవాల్సినంత ఖర్చు అవుతుంది. ప్రస్తుతం క్యాన్సర్ మహ్మమారిని జయించే సమయం వచ్చేసిందని తెలుస్తోంది. ప్రపంచం పోలియోను ఓడించినట్లే.. శాస్త్రవేత్తలు క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను తయారు చేశారు.**

రష్యా క్యాన్సర్ వ్యాక్సిన్ అందుబాటులోకి..

రష్యా ఈ వ్యాక్సిన్‌ను అతి త్వరలో ప్రపంచానికి తీసుకువస్తోంది. ఈ వారమే రష్యా తన సొంత ఆధారిత వ్యాక్సిన్‌ను క్యాన్సర్‌కు చికిత్స చేసేందుకు అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. ఈ క్యాన్సర్ వ్యాక్సిన్ 2025 ప్రారంభం నుంచి తమ పౌరులకు ఉచితంగా అందుబాటులో ఉంటుందని ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. ఈ వ్యాక్సిన్ క్యాన్సర్‌ను ఓడించడంలో సాయపడుతుందని రష్యా పేర్కొంది. క్యాన్సర్‌కు ఇదే మొదటి వ్యాక్సిన్ కావడం విశేషం. రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ రేడియాలజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఆండ్రీ కప్రిన్ ప్రకారం.. ఈ వ్యాక్సిన్ అన్ని ప్రీక్లినికల్ పరీక్షలలో పాస్ అయింది.


ఈ టీకా క్యాన్సర్ కణాల పెరుగుదలను ఆపడమే కాకుండా మెటాస్టాసిస్ స్థాయికి చేరకుండా నిరోధించే సామర్థ్యాన్ని కూడా చూపింది. రష్యా కూడా ఏఐ సాయంతో క్యాన్సర్ వ్యాక్సిన్‌లను తయారు చేస్తోంది.

వాస్తవానికి టీకా అనేది రోగనిరోధక ప్రతిస్పందనను ఉత్పత్తి చేసే మెసెంజర్ అణువు కాపీని ఉపయోగించే ఒక రకమైన టీకా.

ఇప్పుడు, రష్యా శాస్త్రవేత్తలు క్యాన్సర్‌కు వ్యతిరేకంగా ఈ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. క్యాన్సర్ రోగులందరికీ ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు వెల్లడించింది.





## హిట్ కోసం ఎదురుచూస్తున్న
# కేతిక శర్మ

టాలీవుడ్‌లో యువ నటి కేతిక శర్మ ఇప్పటికీ తన తొలి భారీ విజయాన్ని కోసం ఎదురుచూస్తున్నారు. రొమాంటిక్ సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, మొదటి చిత్రంతోనే గ్లామర్ గర్ల్‌గా గుర్తింపు సంపాదించినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. ఆకాష్ పూరి సరసన నటించిన తొలి సినిమా ప్రేక్షకుల్లో గుర్తింపు తీసుకువచ్చినప్పటికీ వసూళ్ల పరంగా పెద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత నాగశౌర్యతో నటించిన 'లక్ష్య' కూడా ఆమెకు నిరాశనే మిగిల్చింది. వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగా' సినిమా కూడా డిజాస్టర్‌గా నిలవడంతో వరుసగా అవకాశాలు ఆశించినంతగా రాలేదు. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'బ్రో' చిత్రంపై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఆ సినిమా కూడా కేతిక కెరీర్‌కు పెద్ద ఊతం ఇవ్వలేకపోయింది. దీంతో ప్రస్తుతం ఆమెకు పెద్దగా సినిమా అవకాశాలు తగ్గినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం కేతిక శర్మ చాలా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తన క్రేజ్‌ను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే మంచి స్క్రిప్ట్‌తో మళ్లీ వెండితెరపై బలమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలనే ఆశతో ఆమె ఎదురుచూస్తున్నారు.



# ప్రస్తుతం రిలేషన్‌షిప్‌లో లేను

**శృతి హాసన్ క్లారిటీ..**

సినీ నటి శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె ప్రేమ వ్యవహారంపై వస్తున్న ప్రచారాలకు తాజాగా ఆమె స్వయంగా స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం ఎవరితోనైనా ప్రేమ సంబంధంలో ఉన్నారా అని ప్రశ్నించగా, తాను ప్రస్తుతం ఎవరితోనూ ఎలాంటి ప్రేమ సంబంధంలో లేనని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా ప్రచారంలో ఉన్న వార్తలకు తెరపడింది. మరో అభిమాని నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని ప్రశ్నించగా, చిన్నారుల మానసిక వైద్యురాలిగా మారాలని తనకు ఆసక్తి ఉండేదని శృతి తెలిపారు. ఆమె ఇచ్చిన ఈ సమాధానం కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో వరుస విజయాలతో గుర్తింపు తెచ్చుకున్న శృతి హాసన్ ప్రస్తుతం సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తక్కువ చిత్రాలు చేస్తున్నప్పటికీ అభిమానులతో మాత్రం సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం మమేకమవుతున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించిన శృతి హాసన్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే ఆమె నటించనున్న 'సలార్--2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు స్వయంగా సమాధానం ఇవ్వడంతో శృతి హాసన్ వ్యాఖ్యలు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.



# నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు

**సునీత మరోసారి స్పష్టీకరణ..**

గాయని సునీత ఇటీవల చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీయగా, వాటిపై మరోసారి ఆమె స్పందిస్తూ తన ఉద్దేశాన్ని వివరించారు. 'నా శరీరం.. నా హక్కు' అనే అంశంపై తాను చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. మహిళల హక్కులను తాను ఎప్పుడూ గౌరవిస్తానని, మహిళలపై జరిగే అన్యాయాలకు ఎప్పటికీ మద్దతు ఇవ్వనని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సునీత, మహిళలకు తమకు నచ్చిన దుస్తులు ధరించే పూర్తి హక్కు ఉన్నప్పటికీ, సమాజంలోని వాస్తవ పరిస్థితులను కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో గాయని చిన్మయి శ్రీపాద స్పందిస్తూ, సునీత పట్ల తనకు గౌరవం ఉన్నప్పటికీ, అలాంటి వ్యాఖ్యలు మహిళల హక్కులకు వ్యతిరేకంగా అర్థమయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.



మహిళల శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కు పూర్తిగా వారిదేనని ఆమె పేర్కొన్నారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన సునీత, చిన్మయిపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. 'నా శరీరం.. నా ఇష్టం' అనే భావన అర్థం తనకు పూర్తిగా తెలుసని, ప్రతి వ్యక్తికీ తన శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కు ఉంటుందని చెప్పారు. అయితే తాను చెప్పదలచుకున్నది సమాజంలో ఇప్పటికీ ఉన్న వాస్తవ పరిస్థితుల గురించేనని, మహిళలపై వేధింపులు లేదా అన్యాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించనని స్పష్టం చేశారు. ఎవరైనా మహిళల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే వారికి వ్యతిరేకంగా నిలబడే వారిలో తాను కూడా ఉంటానని పేర్కొన్నారు. ఫెమినిజం గురించి కూడా సునీత తన అభిప్రాయాలను వెల్లడించారు. మహిళలు, పురుషులు పరస్పరం గౌరవించుకోవడం, అవకాశాల్లో సమానత్వం ఉండటమే తన దృష్టిలో ఫెమినిజం అని తెలిపారు. మహిళలను తక్కువగా చూడడం, వారి అభిప్రాయాలను నిర్లక్ష్యం చేయడాన్ని తాను వ్యతిరేకిస్తానని చెప్పారు. సమానత్వం అంటే అందరూ ఒకేలా ఉండడం కాదని, భిన్న లక్షణాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, సమాన అవకాశాలు ఉండాలన్నదే తన అభిప్రాయమని వివరించారు. మహిళల హక్కులు, సమానత్వం వంటి అంశాలపై గతంలోనూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన సునీత, చిన్మయి వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.